ప్రజాశక్తి

శనివారం 1 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి సురేష్

ప్రతి సంక్షేమ పథకంలోనూ

మహిళలకు తొలి ప్రాధాన్యం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- వేడుకగా ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని.. ప్రతి పథకంలో అక్కచెల్లెమ్మలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. యర్రగొండపాలెంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మంత్రి సురేష్‌పై మహిళలు పూలవర్షం కురిపిస్తూ.. స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ ఆడపడుచుల పేరిట అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. జగనన్న సుదీర్ఘ పాద యాత్రలో మహిళల కష్టాలు తెలుసుకొని, వారిని రుణ విముక్తులను చేస్తానంటూ నాడు ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ప్రవేశపెట్టి వారి రుణాలన్నీ నాలుగు దశలుగా తీర్చే బహత్తర బాధ్యత తనపై వేసుకున్నారని తెలిపారు. తమ ప్రభుత్వంలో అమలయ్యే ప్రతి పథకం మహిళల సాధికారికతను సాధించేలా ఉంటాయని చెప్పారు. అదే జగనన్న ఆశయమన్నారు. మహిళల ఆర్థికాభివద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రతి

▶ 2లో

ముందస్తు వ్యూహాలపై ఉత్కంఠ

- పోటీకి సన్నద్ధంగా ఉండాలనే సంకేతాలు
- ప్రధాన రాజకీయపార్టీల్లో పెరిగిన అప్రమత్తత
- ఎన్నికలే ప్రధాన ఎజెండాగా నేతల అడుగులు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నాలుగు రోజులుగా ముందస్తు ఎన్నికల ప్రచారం రాజకీయ పార్టీల్లో తీవ్రమైంది. ఇదే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా చర్చ సాగుతోంది. ప్రధాన పార్టీల్లో ఉత్కంఠకు దారితీస్తోంది. సిఎం ఢిల్లీ పర్యటన వెనుక ముందస్తు వ్యూహమేనన్న కథనాలతో రాజకీయ శిబిరాల్లో మరింత వేడి పెరిగింది. ఇదే ఇప్పుడు ప్రధాన అంశంగా చర్చలోకి వచ్చింది. తెలంగాణాతో పాటు ఎన్నికలు జరుగుతాయనే సంకేతాలు వస్తున్నాయి. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా సిద్ధంగా ఉండాలని ముఖ్యనేతలకు పార్టీల అధిష్టానాల నుంచి సమాచారం అందుతోంది. పాలకపక్షం ఎత్తుగడలు ఎలా ఉన్నాయనే దానిపై ప్రతిపక్షాలు కూడా ఆరా తీస్తున్నాయి.

కేంద్రం అంగీకరిస్తే తెలంగాణాతో పాటే ఇక్కడా ఎన్నికలు పెట్టాలనే ఆలోచన పాలకపక్షంలో ఉందనే చర్చ బాహాటంగా సాగుతోంది. మే నెలలో గానీ, జూన్‌లో గానీ అసెంబ్లీ రద్దు చేస్తారనే ప్రచారం తీవ్రమైంది. ఇది కేవలం ప్రచారమేననే పరిస్థితి కూడా లేదు. పాలకపక్షం కదలికలపై కేంద్రం నుంచి ప్రతిపక్షాలకు సమాచారం అందుతోంది. ఎందుకంటే కేంద్రంలో పాలన సాగిస్తోన్న బిజెపికి ఇక్కడ వైసిపి, తెలుగుదేశం.. రెండు పార్టీలూ అనుకూలంగానే ఉన్నాయి. ఇక ఎన్నికలపైనే ఇప్పుడు చర్చలు సాగుతున్నాయి. సోషల్‌మీడియాలో పోస్టులు మరింత వైరల్‌గా మారుతున్నాయి. ఏం జరుగుతుందనే ఉత్కంఠ చర్చ సాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు పాలకపక్షానికి దిమ్మతిరిగేలా చేశాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. విద్యావంతులు ఎక్కువమంది ప్రభుత్వంపై కన్నెర్ర చేశారు. మూడు ప్రాంతాల్లోనూ ఎమ్మెల్సీలు ఓడిపోవడం చూశాక పాలకక్షంలో అంతర్మథనం మొదలైంది. ఫలితాలు ఆందోళన కలిగించాయి. మరోవైపు ఉద్యోగులు కూడా పూర్తిగా వ్యతిరేకంగా మారారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు గెలిచినా వారికి కలిసిరాలేదు. ప్రైవేటు టీచర్లను చేర్చి కొనుగోలు చేసి.. గెలిచారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ ఇప్పుడు ప్రభుత్వంపై పోరాటాలను కొనసాగిస్తున్నారు. పరిస్థితి చేజారుతోందన్న చర్చ పాలకవర్గంలో తీవ్రమైంది. నెల్లూరు జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు చేజారిపోవడం కూడా మరో కీలక పరిణామంగా ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై నివేదికలు సంతృప్తిగా లేవన్నదే సమాచారం. దీంతో అసంతృప్తి ఇంకా పెరిగితే పరిస్థితి గడ్డుగా మారుతుందనే ఆలోచనతోనే సిఎం జగన్ ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతున్నారనే చర్చ సాగుతోంది. కేంద్రం అంగీకరిస్తే ముందస్తు ఎన్నికలకు వెళతారనే అంచనాల్లో ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం కూడా ఇదే ఆలోచనలో ఉంది. చంద్రబాబు ఇటీవల జిల్లాకు వచ్చినపుడే జిల్లా నేతలకు ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పారు. వైసిపి

▶ 2లో

డబ్బులు ఎప్పుడిస్తారో.?

- టిడ్కో లబ్ధిదారులకు తిరిగివ్వాల్సిన సొమ్ము రూ.21 కోట్లు
- రూ.4 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్న వైనం
- తాజాగా మరో రూ.3 కోట్లు వచ్చినా ఇవ్వకుండా దోబూచులాడుతున్న అధికారులు
- ఇల్లు రాక, డబ్బులూ తిరిగివ్వక మనోవేదనలో లబ్ధిదారులు



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'పేర్నమిట్టకు చెందిన సత్యవతి టిడ్కోలో ఇంటి కోసం కార్పొరేషన్‌కు రూ.75 వేలు డబ్బులు చెల్లించారు. లక్ష రూపాయలు లబ్ధిదారుని వాటా చెల్లిస్తే డబుల్ బెడ్‌రూం ప్లాటు ఇస్తామంటే అప్పుచేసి మరీ తెచ్చి కార్పొరేషన్‌కు డబ్బులు కట్టారు. టిడ్కోలో ఇల్లు మంజూరు కాలేదు. ఇల్లు రాలేదు కాబట్టి డబ్బులు తిరిగిస్తామన్నారు. డబ్బులు తిరిగివ్వాలని ఐదుసార్లు కార్పొరేషన్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. అధికారులు ప్రభుత్వం నుంచి డబ్బులు రావాలని.. వచ్చాక ఇస్తామని చెబుతున్నారు. పిల్లల స్కూల్ ఫీజుకు డబ్బులు అవసరమై గత వారం రోజులుగా మరలా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పాతపాటే పాడుతున్నారు. డబ్బులెప్పుడిస్తారో స్పష్టంగా చెప్పడం లేదు.

ఇది ఒక్క సత్యవతి సమస్యే కాదు. టిడ్కోలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటే డబ్బులు చెల్లించిన వేలాది మంది సమస్య. మీరు కొద్దిగా వాటా ధనం చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం చెల్లించి, బ్యాంకు లోన్లు ఇప్పించి కట్టించిన ఇళ్లు మీ చేతిలో పెడతామని చెబితే వేలాది మంది ప్రజలు డబ్బులు కార్పొరేషన్‌కు కట్టారు. ఈ పథకంలో 11,830 మందికి గానూ రూ.21.12 కోట్ల డబ్బులు తిరిగి ఇవ్వాల్సి ఉంది. అందులో రూ.4.22 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు అధికారులు తిరిగి చెల్లించారు. మరో రూ.17.09 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉంది. ఆ డబ్బుల కోసం నాలుగేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నా.. ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు.

మొత్తం లబ్ధిదారుల వివరాలివీ..

2018 సంవత్సరంలో టిడ్కోలో జిప్లస్-3 పద్ధతిలో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు అప్పటి టిడిపి ప్రభుత్వం నగరంలో 15,958 మంది నుంచి మూడు కేటగిరిల్లో రూ.27.48 కోట్లు డబ్బులు కట్టించారు. అందులో మొదటి, రెండు విడతల్లో 6 వేల మందికి చింతల, చొప్పోలు వద్ద ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ నిర్మాణాల విషయంలో రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. 6 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి 1,872 మంది ఇళ్లు అస్సలు నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో ఆ ఇళ్లు రద్దు చేసింది. 4,128 ఇళ్లు మాత్రమే నిర్మించి ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. మొత్తంగా 11,830 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.21.12 కోట్లు డబ్బులు తిరిగి చెల్లించాల్సి ఉంది. ప్రజల నుంచి వసూలుచేసిన రూ.27.48 కోట్లలో టిడ్కోకు రూ.23.25 కోట్లు బదలాయించారు. మిగిలిన రూ.4.22 కోట్లు లబ్ధిదారులకు తిరిగి చెల్లించారు.

ఇంకా చెల్లించాల్సింది రూ.17 కోట్లు..

మొదటి, రెండో విడతలో ఇళ్లు మంజూరయ్యి తరువాత రద్దయిన లబ్ధిదారులు 1872 మంది ఉన్నారు. వీరికి సంబంధించి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. వారు కట్టిన డబ్బులు రూ.10.14 కోట్లు మాత్రం తిరిగి

▶ 2లో

9 మంది తహశీల్దార్ల బదిలీ

ఉత్తర్వులిచ్చిన బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో తొమ్మిది మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాలివీ..

తహశీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
పి.పార్వతి	అడ్మినిస్టేటివ్ ఆఫీసర్, కలెక్టరేట్	చినగంజాం
బి.సుశీల	సూపరింటెండెంట్, కలెక్టరేట్, బాపట్ల	అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ కలెక్టరేట్,బాపట్ల
టి.ప్రశాంతి	తహశీల్దార్, చెరుకుపల్లి	సూపరింటెండెంట్ కలెక్టరేట్, బాపట్ల
డి.మల్లిఖార్జునరావు	రేపల్లె	చెరుకుపల్లి (ఎఫ్ఎసి)
కె.నరశింహారావు	తహశీల్దార్ (ఆన్ లీవ్)	డిఎవో, ఆర్‌డివో ఆఫీసు, చీరాల
పి.సీతారత్నం	బల్లికురవ	సూపరింటెండెంట్, ల్యాండ్ సెక్షన్, కలెక్టరేట్
జివి.సుబ్బారెడ్డి	అద్దంకి	బల్లికురవ (ఎఫ్ఎసి)
డి.కవిత	బాపట్ల	పిట్టలవానిపాలెం
సిహెచ్.సుధారాణి	పిట్టలవానిపాలెం	బాపట్ల



ఒంగోలులో మోటూరు ఉదయం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

మోటూరు ఉదయం స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమిద్దాం

'ముందస్తు' వ్యూహాలపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం నేతలకు సూచించారు. పాలకపక్షం నుంచి ముఖ్యనేతలకు ఇదే విషయం స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. నియోజకవర్గాల్లో రాజకీయ వ్యూహాల్లో ఉన్నారు. గడపగడపకూ వెళ్లడం తగ్గించారు. ఎన్నికల్లో గెలుపుకోసం అవసరమైన పంథాపై దృష్టి సారించారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులపైనా దృష్టి పెట్టారు. బూత్‌స్థాయి సిబ్బందితో సమావేశాలు పెడుతున్నారు. పార్టీల నుంచి క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసుకున్న యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. రాజకీయ సమీకరణలపైనా చర్చలు సాగుతున్నాయి. కొత్త పొత్తులు ఎలా ఉండబోతున్నాయనేదీ చూడాలి. నియోజకవర్గాల్లో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఇక పార్టీల్లో టిక్కెట్లపై స్పష్టత లేని నేతలు ఏదో రూపంలో తమ అసంతృప్తులను వ్యక్తం చేస్తున్నారు. మార్చి తర్వాత అభ్యర్థులపై స్పష్టత వస్తుందని గతంలో సిఎం జగన్ ఎమ్మెల్యేల సమావేశంలో వెల్లడించారు. ఇప్పటికీ సగం స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత లేదు. వారికి పోటీగా మరి కొందరు నేతలు సీట్లు ఆశిస్తున్నారు. ఇవన్నీ గందరగోళానికి దారితీస్తున్నాయి. అసంతృప్తులు పెరుగుతున్నాయి. వర్గాలు, గ్రూపులు నడుస్తున్నాయి. అసమ్మతి ఎలా ఉందో కొండపి నియోజకవర్గంలో సిఎం పర్యటనలోనే బట్టబయలైంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎవరన్న దానిపై పాలకపక్షంలోనే ఎక్కువ నియోజకవర్గాల్లో స్పష్టత రాలేదు. తెలుగుదేశం నుంచి దాదాపుగా పోటీచేసే అభ్యర్థులు తేలిపోయారు. ఒకటిరెండు స్థానాల్లోనే సందిగ్ధం ఉన్నా ఇన్‌ఛార్జిలకే టిక్కెట్టు దక్కుతుందనే చర్చే ఉంది. ఏదేమైనా ముందస్తుపైనే ఇప్పుడు చర్చ సాగుతోంది. ముందస్తు ఎన్నికలు ఉంటాయా? లేదా? అనేదానికి పాలకపక్ష నేతల నుంచి స్పష్టమైన వివరణ కనిపించడం లేదు. అంతా అయోమయంలోనే ఉన్నారు. అధినేత ఏ నిర్ణయం తీసుకుంటే దాన్ని అమలు చేయడం తప్ప మరో ఆలోచన లేదనే భావనలోనే పాలకపక్ష నేతలున్నారు.

ప్రతి సంక్షేమ పథకంలోనూ మహిళలకు తొలి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

ఇంట్లో సంక్షేమ పథకాల ద్వారా కనీసం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు లబ్ధి పొందారని వెల్లడించారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎప్పుడైనా ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టారా.? అని ప్రశ్నించారు. అధికారం చేపట్టాలని తాపత్రయ పడుతున్న చంద్రబాబు ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పగలరా? అని సవాల్ విసిరారు. 2016లో ఆగిపోయిన సున్నావడ్డీ పథకాన్ని వైఎస్సార్‌సిపి ప్రభుత్వం మళ్లీ అమలు చేస్తోందని తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. అదేవిధంగా 2024 ఎన్నికల్లో కూడా మోసం చేసేందుకు యత్నిస్తారని, అయితే బాబు కల్లిబొల్లి మాటలను ఎవరూ నమ్మరని స్పష్టం చేశారు. అవినీతి రాజకీయాలకు అలవాటు పడిన చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని ఆరోపించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పి హైదరాబాద్‌కు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మూడు మండలాల్లోని 1667 డ్వాక్రా సంఘాలకు రూ.8 కోట్ల 10 లక్షల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్‌డిఎ పీడీ బాబూరావు, డిఎల్‌డిఓ సాయికుమార్, వైసిపి యువనేత ఆదిమూలపు విశాల్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల జడ్‌పిటీసీలు చేదూరి విజయ భాస్కర్, వాగ్యానాయక్, యర్రగొండపాలెం, గంజివారిపల్లి సర్పంచులు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఎంపిడిఓ ఎం.రామసుబ్బరంగయ్య, వైసిపి యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి, వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

త్వరితగతిన 'తీగలేరు' పనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తీగలేరు సాగేనా..పరిపాలన అనుమతులతోనే టి5 కాలువ సరి..మూడు మండలాల రైతుల ఎదురు చూపు అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో గతనెల 18న ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి వెలిగొండ ప్రాజెక్టు కార్యానిర్వాహక ఇంజనీరు వ్రారార్ధనరెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి5 కాలువ నిర్మాణంపై ప్రస్తుతం ఎస్టిమేట్ టెక్నికల్ శాంక్షన్ ఛీఫ్ ఇంజినీర్ అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. తిరిగిత పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయానికి తదుపరి టెండర్ ప్రక్రియ గురించి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియలో ఆలస్యమైనట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కాలువ పనులకు సంబంధించి టెండర్ ఫ్లోట్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గుత్తేదారుని గుర్తించి త్వరితగతిన పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వెలిగొండ ప్రాజెక్టు కార్యానిర్వాహక ఇంజనీరు పురార్ధన రెడ్డి లేఖ సంఖ్య ఇఇ/విజిపి/డివిజన్/ఎంఆర్‌కె/రిజాయిండర్/87౦ 18.03.2023 ద్వారా తెలియజేశారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

కనిగిరి : కనిగిరి బార్ అసోషియేషన్ కమిటీకి శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పాశం పిచ్చయ్య,సెక్రటరీగా యరజర్ల బాలనారాయణ, ఉపాధ్యక్షుడిగా శీలం మాల కొండారెడ్డి, జాయింట్ సెక్రటరీగా అచ్యుత సుబ్బారావు, కోశాధికారిగా బుర్రి శ్రీనివాసులు, ఇసి సభ్యులుగా గయ్యద్ షాహిద్ మోహమ్మద్, మాసిపోగు చంద్రబాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా చింతకుంట్ల సాల్మన్ వ్యవహరించారు.

డబ్బులు ఎప్పుడిస్తారో.?

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వలేదు. అస్సలు ఇల్లు రాక, పట్టా ఇవ్వక డబ్బులు తిరిగి చెల్లించాల్సిన వారు 9,958 మంది ఉన్నారు. వీరికి రూ.9.37 కోట్లు తిరిగివ్వాలి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారుల వాటా రూ.లక్ష నుంచి రూ.50 వేలకు రూ.50 వేల నుంచి రూ.25 వేలకు తగ్గించింది. ఇలా లబ్ధిదారుల వాటా తగ్గిన వారికి తిరిగి రూ.1.61 కోట్లు తిరిగివ్వాలి. మొత్తంగా ప్రజలకు తిరిగి ఇవ్వాల్సింది రూ.21.12 కోట్లు. అందులో రూ.4.22 కోట్లు ఈ పాటికే కార్పొరేషన్ వద్ద అందుబాటులో ఉన్న డబ్బులు ఇచ్చేశారు. ఇంకా సుమారు రూ.17 కోట్లు తిరిగి ఇవ్వాల్సి ఉంది.

డబ్బులు కావాలని వచ్చిన దరఖాస్తులు 1,415...

మొత్తం 11830 మందికి ప్రభుత్వం డబ్బులు తిరిగి చెల్లించాల్సి ఉండగా. 'తాము చాలా ఇబ్బందుల్లో ఉన్నాం...మా డబ్బులు మాకు తక్షణమే తిరిగి ఇవ్వండి' అని 1,415 మంది కార్పొరేషన్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి వెంటనే డబ్బులు ఇవ్వాలన్నా సుమారు రూ.7.50 కోట్లు కావాలి.

రూ.3 కోట్లు విదిల్చిన ప్రభుత్వం..

టిడ్కో లబ్ధిదారులకు సుమారు రూ.17 కోట్ల వరకు కార్పొరేషన్ తిరిగి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ఈ డబ్బులు ఇవ్వకుండా గత నాలుగేళ్లుగా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో లబ్ధిదారులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇటీవల ఒంగోలులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజల వద్దకు వెళ్లినప్పుడు టిడ్కోలో డబ్బులు కట్టి ఇల్లు రాని వారు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీంతో ఆయన వెంటనే జిల్లాకు చెందిన పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు విషయం చెప్పారు. దీంతో ప్రభుత్వం నుంచి మూడు మాసాల కిందట రూ.3 కోట్లు ఒంగోలు కార్పొరేషన్‌కు డబ్బులు విడుదల చేశారు.

ఎవరికి ఇవ్వాలో అర్థం కాక..!

రూ.17 కోట్లు లబ్ధిదారులకు తిరిగి చెల్లించాలి. అందులో ప్రభుత్వం కేవలం రూ.3 కోట్లు మాత్రమే ఇచ్చింది. డబ్బుల కోసం ఈపాటికే దరఖాస్తు చేసుకున్నవారికి తిరిగి ఇవ్వాలన్నా సుమారు రూ.7.50 కోట్లు కావాలి. ఈ నేపథ్యంలో అస్సలు ఎవరికి డబ్బులు చెల్లించకుండా అధికారులు ఆ రూ.3 కోట్ల రూపాయల నిధులను 3 నెలలుగా వారి అకౌంట్‌లోనే ఉంచేశారు. లబ్ధిదారులు మాత్రం నిత్యం కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అందుబాటులో ఉన్న నిధులు ఎవరికి ఇవ్వాలో అర్థంకాక అధికారులు లబ్ధిదారులతో దోబూచులాడుతున్నారని సమాచారం.

త్వరలోనే అందరికీ డబ్బులు ఇచ్చేస్తాం..

ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్

ప్రభుత్వం ఇటీవలే రూ.3 కోట్లు విడుదల చేసింది. కార్పొరేషన్ లబ్ధిదారులకు సుమారు రూ.17 కోట్ల వరకు తిరిగి చెల్లించాలి. ఈ నేపథ్యంలో ఒకరికి ఇచ్చి, ఒకరికి ఇవ్వకపోతే ఇబ్బందులు వస్తాయి. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వాల్సిన డబ్బులన్నీ తిరిగి ఇవ్వాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరి ఉన్నారు. మరో వారం, రెండు వారాల్లోనే మనం కట్టిన డబ్బులన్నీ ప్రభుత్వం నుంచి తిరిగి వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే కార్పొరేషన్ ఆఫీసులో డబ్బులు చెల్లించిన వారందరినీ సమావేశ పరచి వారి డబ్బులు వారికి తిరిగిచ్చే ఏర్పాటు చేస్తాం.

'ఆసరా' చెక్కులు అందజేత

ప్రజాశక్తి-పిసిపల్లి

డ్వాక్రా గ్రూపు మహిళలకు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులను కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ శుక్రవారం అందజేశారు. ఎపిఎం టి.ఇందిరమ్మ అధ్యక్షతన చెక్కులు అందజేశారు. మండలంలో మొత్తం 517 గ్రూపులకు రూ.3.42 కోట్లు అందజేసినట్లు ఎపిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్యాల జఫన్య, వెలుగు సిసిలు వి.శశిరేఖ, డి.తిలకమ్మ, కె.రమణయ్య, వైసిపి నాయకులు, గృహసారధుల మండల కన్వీనర్ కేలం సుదర్శనం, మాజీ సర్పంచి మేకల మాల్యాద్రి, గుంటగాని భాస్కర్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులు శుక్రవారం అందజేశారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఎంపిపి గాయం సావిత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. మండలంలో మొత్తం 419 గ్రూపులకు రూ.2.54 కోట్ల చెక్కులు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు హరిబాబు, మాజీ ఎంపిపి గాయం బలరాంరెడ్డి, వైస్ ఎంపిపి కొదమల బెంజిమెన్, సొసైటీ అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసరెడ్డి, మద్ది తిరుపతయ్య, గంగరాజు యాదవ్, భవనం కష్టారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కష్తాల బేబి, సర్పంచులు, ఎంపిటిసీలు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి : సర్పంచి

శింగరాయకొండ : శింగరాయకొండ గ్రామ పంచాయతీని వార్డు సహకారంతో అభివృద్ధి చేద్దామని సర్పంచి తాటిపర్తి వనజ తెలిపారు. స్థానిక కార్యాలయంలో వార్డు సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంచాయతీ రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేదని తెలిపారు. రికార్డుల నిర్వాహణ విషయమై గతంలో తాను జిల్లా కలెక్టర్, డిఎల్‌పిఒకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శింగరాయ కొండ ఇన్‌ఛార్జి కార్య దర్శిగా ఊళ్లపాలెం కార్యదర్శి సైదులును నియమించినట్లు ఆమె తెలిపారు. సైదులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సైదులుకు వార్డు మెంబర్లు గంజి సుబ్బారావు, తన్నీరు నాగేశ్వరరావు, పాదర్తి కోటేశ్వరరావు, షేక్ కరీం , శంకర్ రెడ్డి, నరేష్ , పడిదపు రవికుమార్ అభినందనలు తెలిపారు.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

15 వేల రూపాయలు, మోటారు సైకిల్ స్వాధీనం ● జిల్లా ఎస్పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

నగదు బదిలీ చేయాలని వచ్చి దుకాణ యజమానిపై దాడిచేసి రాబరీ చేసిన ముద్దాయిలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి మల్లికగర్గ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15 వేలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్పి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్పి తెలిపిన వివరాల మేరకు రాజస్దాన్ రాష్ట్రం, నాగోర్ జిల్లా, చందవత గ్రామానికి చెందిన సవర్‌రాం, సాగర్ నాయక్ అనే ఇద్దరు నిందితులు దోపిడీకి పాల్పడినట్లు తెలిపారు. ముద్దాయిలు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరిరువురూ ఈ నెల 4వ తేదీన సంతనూతలపాడు ఎంఆర్‌ఓ ఆఫీస్ వెనుక ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్న గాదంశెట్టి శ్రీనివాసులు దుకాణానికి వెళ్లారు. వారు నగదు బదిలీ చేయాలని అడిగారు. అయితే వారి ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ లింక్ కాకపోవడంతో అది కుదరదని తెలిపారు. వారు



మాట్లాడుతున్న ఎస్పి మల్లికగర్గ్

వెంటనే ఎటిఎం కార్డు ఇచ్చి డ్రా చేయాలని చూశారు. అది కూడా పనిచేయలేదు. వారిరువురూ అతనిని మాటల్లో పెట్టి ఒక వ్యక్తి షట్టర్ వేయగా రెండో వ్యక్తి అతనిపై దాడి చేసి గాయపరిచాడు. అలాగే రెండో వ్యక్తి కత్తితో దాడిచేయగా అతనికి గాయమయింది. వెంటనే వారు అతని వద్ద ఉన్న రూ.15 వేలు దోచుకుని వెళ్లిపోయారు. నిందితులు దుర్వ్యసనాలకు బానిసలై దోపిడీకి పాల్పడినట్లు తెలిపారు. దీంతో రూరల్ ఇన్‌చార్జి సిఐ రంగనాథ్ ఆధ్వర్యంలో కేసును ఛేదించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన ఎఎస్‌పి ఎస్‌వి శ్రీధర్‌రావు (క్రైం), ఒంగోలు డిఎస్‌పి యు నాగరాజు, సిఐ రంగనాథ్, ఆంజనేయులు, సిబ్బందిని అభినందించారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి

సిబ్బంది సమస్యల సత్వర పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని జిల్లా ఎస్పి మల్లికగర్గ్ తెలిపారు. శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి వినతులను స్వీకరించారు. సిబ్బంది సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఐ ముక్కంటిని సన్మానిస్తున్న దృశ్యం

ఎస్ఐ ముక్కంటికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు మండలంలోని తాడివారిపల్లి ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఎపి ట్రాన్స్‌కో, గుంటూరుకు బదిలీపై వెళ్లిన ఎస్ఐ ముక్కంటిని, పొదిలి సిఐ సుధాకర్, టివిపల్లి ఎస్ఐ వేముల సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేసి సన్మానించారు. శాలువాలతో, పూలమాలతో వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎస్ఐ, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు: హెన్రీ క్రిస్టినా

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు పొందుతారని గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెన్రీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు అవకాశం ఉన్న మేరకు పేదలకు ఉపయోగపడాలని అన్నారు.


శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టినా

శ్రీనివాసరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేయటం బాధాకరమని అన్నారు. విలువలతో కూడిన వ్యక్తి తన పదవీ కాలం ఉండగానే స్వచ్ఛంద విరమణ పొందటం కొంత బాధాకరం అయినా ఆయన పరిస్థితిని బట్టి ఆధారపడి ఉంటుందని అన్నారు. జడ్పీ సిఈఓ మోహనరావు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ఉద్యోగంలో చేరి ఎనలేని కీర్తి సంపాదించడం అందరికీ సాధ్యం కాదని అన్నారు. తన ఉద్యోగంలో ప్రజలకు సేవ చేయాలి అనే భావన ఉండటం వలనే అందరి ప్రశంసలు పొందుతున్నారని అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందటం కొంత బాధ కలిగించినా తన శేష జీవితం కుటుంబంతో గడపాలని కోరుకున్నారు. డిఎల్‌డిఓ సువార్తమ్మ మాట్లాడుతూ గతంలో తాను ఎంపీడీఓగా చేస్తున్నప్పటి నుంచి జిల్లా పరిషత్‌లో శ్రీనివాసరావు సుపరిచితులని అన్నారు. అంకితభావంతో పనిచేసి అనేక మంది అధికార, అనధికారుల వద్ద ప్రశంసలు పొందారన్నారు. అనంతరం స్వచ్ఛంద విరమణ పొందిన శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులను కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీఓ రాధాకృష్ణ, ఇన్‌ఛార్జి ఎంపీడీఓలు ఏలీషా, పద్మజ, ఎంపీపీ బాజీ, ఏపిఎన్‌జిఓ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు రామరాజు, కృపానందం, నాయకులు దేవేందర్ రాజు, మండే విజయ్, గోవతోటి విజయ్, శివారెడ్డి, సర్పంచ్ గంగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పి వకుల్ జిందాల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమం, వత్తిపరమైన, ఆరోగ్యపరమైన మరియు వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించటానికి గ్రీవెన్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు, ఇతర విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది మొత్తం 45 మంది పాల్గొని వారి యొక్క వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సభ్యుల ఆరోగ్యపరమైన సమస్యల కారణంగా బదిలీలు, ఇతర సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను కూలంకుషంగా విని, వారి విన్నపాన్ని పరిశీలించి, సానుకూలంగా స్పందించారు. అధికారులతో ఎస్పీ వెంటనే మాట్లాడి ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి నెలలో ఒకరోజు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే రోజు పోలీస్ సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలపవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, డిపిఓ ఏ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా ఖాసీం, మరియు డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు యువకులు అరెస్టు

ప్రజాశక్తి-నగరం

చెడు వ్యసనాలకు బానిసలై డబ్బు సంపాదన ధ్యేయంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను నగరం ఎస్ఐ రామకృష్ణ, వారి సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. గత కొద్ది రోజుల నుంచి నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, అడవులదీవి స్టేషన్‌ల పరిధిలోని పొలాల్లోని నీటి మోటార్లు, ఇంటి బయట పెట్టిన మోటార్ సైకిలు మిస్సింగ్ కేసులు నమోదు కావడంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, రేపల్లె డిఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలతో సిఐ శివశంకర్ స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. నగరం ఎస్ఐ వారి సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్నారు. అనుమానాస్పదంగా తారసపడిన చెరుకుపల్లి మండలం కావూరు వెంకటరెడ్డి పాలెం గ్రామస్తులు పగడం పవన్ కళ్యాణ్‌రెడ్డి, కావూరి అజయ్‌రెడ్డిలను గురువారం అదుపులోకి తీసుకొని విచారించగా వారివద్ద నుంచి 8 నీటి ఇంజన్లు, 4 మోటర్ వాహనాలు, ఒక ఆటోను వారివద్ద నుంచి స్వాధీన పరుచుకున్నట్టు శుక్రవారం నగరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. వారిపై ఇప్పటివరకు ఏ కేసులు లేవని, మెకానిక్‌గా పనిచేస్తూ డబ్బుకోసం దొంగతనాలు చేస్తున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్న సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

పది పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-బాపట్ల

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు బాపట్ల ఆర్టిసి డిపో మేనేజర్ టి అజితకుమారి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు ఏ విధమైన బస్సు పాస్‌తో అవసరం లేకుండా హాల్ టికెట్ కండక్టరుకు చూపించి తమ నివాసాల నుంచి పరీక్ష కేంద్రాలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చన్నారు. పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చున్నారు. పరీక్ష జరిగే రోజు మాత్రమే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రయాణంలో అసౌకర్యం కలగకుండా ఈ సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పజాశక్తి-ఒంగోలు క్రైం

అప్పుల వారి వేధింపులు తాళలేక వివాహిత ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండలంలోని యరజర్ల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. యరజర్ల గ్రామం ఎస్‌సి కాలనీకి చెందిన చావల రూతమ్మ, ఏలియా భార్యాభర్తలు. వీరు కూలి పనులు చేసుకుని పిల్లలను పోషించుకుంటున్నారు. వీరు బేల్దారీ పనుల నిమిత్తం వారి బంధువైన ఏలియా వద్ద రూ.30 వేలు తీసుకుని హైదరాబాదు బేల్దారీ పనులకు వెళ్లారు. తిరిగి రెండు నెలల క్రితం వచ్చి వారి గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటున్నారు. అప్పటి నుంచి వారి బంధువు ఏలియా మీరు తీసుకున్న డబ్బులు లక్ష రూపాయలు అయినవని వాటిని ఇవ్వాలని వేధించడం ప్రారంభించాడని తెలిపారు. అయితే గురువారం వారు కూలి పనులకు వెళ్లి వచ్చేసరికి వారుంటున్న ఇంటికి తడికలు అడ్డంపెట్టి వారి పిల్లలను కూడా ఇంటిలోకి పోనివ్వకుండా సాల్మన్ అడ్డుకున్నాడు. వారు పనుల నుంచి వచ్చేసరికి అందరినీ రోడ్డుపై నిలబెట్టడమే కకుండా తీవ్రపదజాలంతో దూషించినట్లు తెలిపారు. దీనితో ఆమె మనస్తాపానికి గురై ఎలుకల మందును తిని ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. బాధితురాలు ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి స్వల్ప గాయాలయిన సంఘటన కొండపిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపిలోని కామేపల్లి రోడ్డులో టిఫిన్ హెూటల్‌కి చెందిన పంతులు అనే యజమాని ద్విచక్ర వాహనంపై తహశీల్దారు కార్యాలయం వైపునకు వస్తున్నాడు. అదే విధంగా కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో చికెన్ షాపులో పనిచేసే కుర్రవాడు కూడా ద్విచక్ర వాహనంపై గాంధీబొమ్మ సెంటర్ వైపు వస్తున్నాడు. ఇద్దరూ ఒకరినొకరు ఢీకొనడంతో ఇద్దరు రోడ్డుపై కిందపడ్డారు. పంతులుకు తలకు తీవ్ర గాయాలు కాగా కుర్రవాడికి కుడి భుజం విరిగిపోయింది. వెంటనే స్థానికులు 108 వాహనంలో కొండపి సిహెచ్‌సి సెంటర్‌కు తీసుకొని వెళ్లి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఇల్లు దగ్ధం.. రూ.లక్ష మేర ఆస్తి నష్టం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని పుల్లలచెరువు రోడ్డులో బలపాల ఫ్యాక్టరీ వద్ద నివాసముంటుంటున్న రామావత్ బాలిబాయి అనే గృహిణి ఇల్లు దగ్ధమై రూ.లక్ష నష్టం వాటిల్లింది. ఇంటిలో ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో వ్యాపించిన మంటలకు ఇల్లంతా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి బూడిదయ్యింది. ఈ ప్రమాదంలో లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరారు.

జాబ్‌మేళాకు 83 మంది ఎంపిక

ప్రజాశక్తి-పర్చూరు

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సిడాప్ నిర్వహించే ఉద్యోగ మేళాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక బిఎఆర్‌టిఎ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగిన ఉద్యోగ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరస్పాండెంట్ కృష్ణంశెట్టి రమేష్‌బాబు మాట్లాడుతూ మేళాలో 15కు పైగా ప్రముఖ బహుళజాతి సంస్థలు హాజరయ్యాయన్నారు. జాబ్ మేళాకు 219 మంది హాజరుకాగా 83 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపిక కానివారు నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్, పార్లమెంటు స్థాయిలో స్కిల్ కళాశాలలో శిక్షణ తీసుకొని బాపట్ల జిల్లాలో జరిగే జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రమేష్‌బాబు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పి వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ జి రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా దుస్తులతో విద్యార్థులు

క్రీడలతో స్నేహ సంబంధాలు

ప్రజాశక్తి అద్దంకి

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు కూడా మెరుగుపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శంఖవరప్పాడు ప్రధానోపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని శంఖవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయులు పి శ్రీనివాసులు బాలుర కబడ్డీ జట్టుకు, సోషల్ ఉపాధ్యాయులు సిహెచ్ రామ్మోహన్రావు బాలికలకు క్రీడా దుస్తులను అందించడంలో ఆర్థిక సహాయ సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఈటి డాక్టర్ ఎన్ వీరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం: జడ్జి

ప్రజాశక్తి-అద్దంకి

రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ పడదగిన కేసులన్నీ మే నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి బాబునాయక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ రెండో జాతీయ లోక్ అదాలత్ కోర్టు పరిధిలోని అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, కొరిసపాడు, జె పంగులూరు మండలాల పరిధిలోని ఆరు మండలాలకు చెందిన కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రెవెన్యూ, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్ రాజీ చేయబడతాయని అన్నారు. రాజీ పడిన కేసులో ఇరువర్గాల వారికి సమన్యాయం వర్తిస్తుందన్నారు. సివిల్ కేసుల్లో కోర్టు ఫీజులు కూడా వాపస్ ఇవ్వబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

వక్ఫ్‌బోర్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కారాదు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వక్ఫ్ బోర్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వక్ఫ్ బోర్డ్ ఆస్తుల అమ్మకాలు జరగకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిషేధిత జాబితాలోకి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లాలో పదో తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ పి పార్వతి అధికారులకు సూచించారు. శుక్రవారం బాపట్ల పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, విద్యాశాఖ అధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆమె వివరించారు. జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు చేసిన 103 పరీక్ష కేంద్రాల్లో పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు జరిగే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ పివిజె రామారావు, బాపట్ల ఉప విద్యాశాఖాధికారి జి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే 'పది' సులువే!

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ ● నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

కష్టపడి చదివేకంటే ఇష్టపడి చదివితే పదో తరగతిలో మంచి ఫలితాలు సులువుగా సాధించవచ్చని ఇంకొల్లు మండలం పూసపాడు ఎస్‌కెవిఎస్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరావు సూచించారు. సహ ఉపాధ్యాయులతో పాటు, దాతల సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పక్కా ప్రణాళికతో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు పోతున్నామన్నారు. ఒక విద్యార్థి సక్రమంగా చదవకపోతే ఆ విద్యార్థి మాత్రమే నష్టపోతాడు. ఒక ప్రధానోపాధ్యాయుడు పాఠశాలలో కీలకపాత్ర పోషించకపోతే ఆ పాఠశాల మొత్తం వెనుకబడి ఉంటుందంటారు శ్రీనివాసరావు మాస్టారు. ఈ నెల 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణపై 'ప్రజాశక్తి' పరిశీలన నిర్వహించింది.

పదో తరగతిలో 25 మంది విద్యార్థులు

ఎస్‌కెవిఎస్ హైస్కూలులో ఈ విద్యా



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

సంవత్సరం 25 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో గత ఏడాది నవంబర్ నాటికే సిలబస్ పూర్తి చేశాం. ఆదివారాలు, సెలవు దినాల్లో కూడా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లా విద్యాశాఖ వారు ఏర్పాటు చేసిన విజయస్ఫూర్తి ద్వారా ప్రతి రోజూ రెండు సబ్జెక్టులపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పూర్తయిన సిలబస్‌ను ఆయా సబ్జెక్టు టీచర్ల సహకారంతో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి ముందుకు పోతున్నామన్నారు. మా పాఠశాల పూర్వ విద్యార్థి మరియు యూనివర్సల్ హైస్కూలు అధినేత పేర్ని రాధాకృష్ణమూర్తి (ఆర్‌కె) సహకారంతో గత 5 సంవత్సరాల నుంచి పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆర్‌కెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల నిర్వహించిన ప్రీపబ్లిక్ పరీక్షల్లో కూడా పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు శ్రీనివాసరావు వివరించారు. పాఠశాల స్థాయిలో పూసపాడుకు చెందిన పి షాకిర ప్రథమ స్థానంలో, వంకాయలపాడు గ్రామానికి చెందిన ఎం మౌనిక ద్వితీయ స్థానం, వంకాయలపాడు గ్రామానికి చెందిన కె సాగర్‌బాబు తృతీయ స్థానంలో నిలిచారని శ్రీనివాసరావు వివరించారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: కె శ్రీనివాసరావు, హెచ్ఎం



పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. ఎప్పటికప్పుడు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధిస్తున్నాము. ఉపాధ్యాయులు కష్టపడి పని చేస్తున్నారు. ఫలితాల సాధనకు అవిరళ కృషి చేస్తున్నారు. దాతల మరియు తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తా: పి షాకిర, టెన్త్ విద్యార్థిని



పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తాను. మా చదువుల్లో ప్రధానో పాధ్యాయుడు, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. సందేహాలను నివృత్తి చేస్తున్నారు మా ఉపాధ్యాయులు. రోజువారీ పరీక్షలు నిర్వహిస్తూ మా సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నారు.

దాతల సహకారం మరువలేనిది: వి సాగర్‌బాబు, విద్యార్థి



దాతలు మాకు స్టడీ మెటీరియల్స్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. పరీక్షలు సులువుగా రాసేందుకు సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కష్టపడి చదువుతున్నాము. మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాము. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కలలు సాకారం చేస్తాం.

38అంశాలకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి-రేపల్లె



రేపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మంగ

రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోనే పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ అజెండాలోని పొందుపరిచిన 38 అంశాలను ఏకగ్రీవంగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. చైర్పన్ కట్ట మంగ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా ఎటువంటి చర్చ లేకుండా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కట్ట మంగా, వైస్‌చైర్ పర్సన్స్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, విశ్వనాథ గుప్తా మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఏఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ కౌన్సిల్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు ఉద్యమాలలోకి రావాలి

ప్రజాశక్తి-చీమకుర్తి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కంకణాల ఆంజనేయులు

నిరంకుశ విధానాలతో ప్రజా స్వామిక హక్కులను హరిస్తున్న మోడీ ప్రభుత్వ చర్యలను అడ్డుకునేయందుకు ప్రజలు ఉద్యమాలలోకి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మర్రిచెట్ల పాలెం జరిగిన చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రా లను పంపిణీ చేశారు. విరాళాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశప్రజలకు భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించిందన్నారు. అనేక పోరా టాల ఫలితంగా కొన్ని హక్కులు, చట్టాలు సాధించుకున్నామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కుతోందన్నారు. కార్మిక చట్టాల ను రద్దు చేసిందన్నారు. ఉపాధిహామీ చట్టం, ఆహార భద్రత చట్టం, కనీస వేతనాల చట్టం సాధించుకున్నామని, వాటిని మోడీ ప్రభుత్వం కనుమరుగు చేస్తోందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రజాతంత్రవాదులు ప్రతిఘటించాలని కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శీలం ఆదినారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, మండల నాయకులు జి చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలి

ప్రజాశక్తి-అద్దంకి




మాట్లాడుతున్న కాపూరి రఘుచంద్

పదో తరగతి విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులు సింగరకొండ రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరాల చిన్న గురవయ్య అధ్యక్షత వహించారు. ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షులు కాపూరి రఘు చందు మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని, అందుకు సరైన నిద్ర, ఆహారం కూడా ఆరోగ్య విషయంలో ప్రధాన పాత్ర వహిస్తాయని రోడ్ల వెంబటి తినుబండారాలే అనారోగ్యానికి కారణాలని రఘుచందు అన్నారు జనవిజ్ఞానవేదిక గౌరవ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ తల్లిదండ్రులను గురువులను గౌరవిస్తూ చదువుతోపాటు విలువైన సమాజాన్ని కూడా చదివిన వారే ఉన్నత స్థితికి చేరుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేమూరి రామకృష్ణ, సంధిరెడ్డి పద్మావతి, శ్రీహరి, హైస్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు బావోజి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుడిలా ఆదరించండి: వేగేశన

ప్రజాశక్తి-కర్లపాలెం



చీరలు పంపిణీ చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

రాబోయే ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, నన్ను మీ కుటుంబ సభ్యుడిలా భావించి ఆదరించాలని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. శుక్రవారం ఇంటింటికీ తెలుగుదేశం, మీ మాట – నా బాట కార్యక్రమంలో భాగంగా కర్లపాలెం మండలంలోని పేరలి గ్రామంలోని తూర్పు యాదవపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ విధానాలను వివరించారు. మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలకు అండగా మా వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ చేరువయిన విషయం అందరికీ తెలుసని అన్నారు. అవినీతి, లంచాలకు తావులేని వ్యవస్థలను నిర్మించి కలిసికట్టుగా మన బాపట్లను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పేరలి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి అండగా నిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏపూరి భూపతిరావు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, మాజీ సర్పంచి బొద్దుకూరి విజయ, మాజీ ఎంపీటీసీ కట్టా సుజాత, మండల ఎస్సీ సెల్ నాయకుడు దాస్, టిడిపి నాయకులు మద్దిబోయిన బుల్లయ్య, మునసయ్య మండల టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శనివారం 1 ఏప్రిల్ 2023

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం.రఫి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకరంగా నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆదానీ, అంబానీ లాంటి సేవలో మోడీ ప్రభుత్వం మునిగి తేలుతోందన్నారు. దేశ రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందన్నారు. అదేమని అడిగిన వారిని జైళ్ళకు పంపుతుందని విమర్శించారు. గ్రామీణ వ్యవసాయ కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా బాదరరెడ్డి, టంగుటూరి సత్య నారాయణ, భూమని వెంకటేశం పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు నిధులు కేటాయించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. ఈ నెల5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని తురకపల్లి దొడ్డి చింతలహాజీపురం, కిష్టంపల్లి గ్రామాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెబుతూ నాలుగేళ్లపాటు కాలాన్ని నెట్టుకొట్టించినట్లు తెలిపారు. రాజకీయ ప్రచారం, ఓట్లు దండుకోవడం కోసం పాలకులు వెలిగొండ ప్రాజెక్టును వినియోగించుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. **కొండపి :** కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్యదర్శి సంఘం జిల్లా నాయకులు కెజి. మస్తాన్ కోరారు. చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని పెట్లూరు ,చినకండ్లగుంట గ్రామాల్లో మిర్చి కూలీలు, వ్యవసాయ కూలీలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్తమ్మ, జానకమ్మ,వెంకమ్మ, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **వెలిగండ్ల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ రాయల మాలకొండయ్య కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాసామిక హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని తెలిపారు. అదేమని అడిగిన వారిని జైల్లోకి పంపుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.


యర్రగొండపాలెంలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


హనుమంతునిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


కొండపిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గ్రామాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గ్రామాల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కె. నాగార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాయవరం పంచాయతీ రూ.50 లక్షల వ్యయంతో జలజీవన మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు పథకంలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వేచ్ఛమైన తాగు నీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణంతో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి గ్రామస్తులకు తాగు నీరు సరఫరా చేయాలని దత్తేదారుడును ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, రాయవరం సర్పంచి భాగ్యమ్మ, వైస్ ఎంపిపి లక్ష్మమ్మ, వైసిపి నాయకుడు అడివయ్య పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి : ఉగ్ర

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్థానికకార్యాలయంలో టిడిపి కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పంచాయతీల టిడిపి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేస్తే ఎన్నికల్లో మన గెలుపు సాధ్యమన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదన్నారు. ముందస్తుగా ఎన్నికలు జరిగినా అందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి టిడిపి కంచుకోటను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, కేసరి రమణారెడ్డి, గౌదకట్ల హరి, తమ్మినేని శ్రీను, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు గోనా వెంకటయ్య, కె.భాస్కర్‌రెడ్డి, డి.సుబ్రమణ్యం, డి. నారాయణరెడ్డి, పల్నాటి కోటిరెడ్డి, బైకాని సుబ్రమణ్యం, సోమిశెట్టి సుబ్బారావు, సోబిరాల వేణుగోపాల్, ముక్కు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంట పాడు గ్రామ పంచాయతీలోని అమత బిఇడి కళాశాల సమీపంలో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు ఉల్చి కమలాదేవి రూ.90 లక్షల విలువైన 20 సెంట్లు భూమిని దేవస్థానం నిర్మాణానికి ఉచితం అందజేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, మూలగుంటపాడు గ్రామ సర్పంచి డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, అమత విద్యాసంస్థల చైర్మన్ కేశవరపు జాలిరెడ్డి, సన్నె బోయిన శ్రీనివాసులు నాయుడు, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు , జెట్టి సూర్య చంద్రశేఖర్ రెడ్డి , నేలపాటి శంకర్, దాసరి శ్రీనివాసులు, రాయి పేర్రాజు, మలినేని వెంకటేశ్వర్లు,తోట ప్రభాకర్, పామర్తి మాధవరావు, ప్రభాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో ఎమ్మెల్యే స్వామి


శంకుస్థాపనలో డాక్టర్ వెంకయ్య

ఐదు విద్యుత్ ప్రభలు ఏర్పాటు

ప్రజాశక్తి-దర్శి

మండలపరిధిలోని రాజంపల్లి వద్ద ముసినది పక్కన ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం 5 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. రాజంపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఒకటి, టిడిపి నాయకులు ఒకటి, జనసేన నాయకులు ఒక ప్రభను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పొదిలి మండలం ఉన్నగురవాయపాలెంకు చెందిన వైసిపి నాయకులు ఒక ప్రభ, కుంచేపల్లి గ్రామానికి టిడిపి నాయకులు ఒక ప్రభను ఏర్పాటు చేశారు. దర్శి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుల ఆధ్వర్యంలో రెండు కోలాట బృందాలు, కొత్తవెంకటాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఓ కోలాటం బృందం సందడి చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్ స్థానిక నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శి డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సిఐ జె రామకోటయ్య పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


పూజలు నిర్వహిస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీ చైతన్య టెక్నో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -శింగరాయకొండ

దేశ వ్యాప్తంగా వివిధ విభాగాలలో నిర్వహించే ఐఎన్‌టిఎస్ఒ పోటీ పరీక్షలలో శింగరాయకొండలోని శ్రీ చైతన్య విద్యార్థులు సత్తాచాటారు. పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులను శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. గత నెలలో నిర్వహించిన ఫైనల్ లెవల్ పరీక్షలలో శ్రీ చైతన్య విద్యార్థులు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. 4,5 స్థానాలను కూడా ఈ విద్యార్థులు సాధించారు. మొత్తం 30 కన్సలేషన్ బహుమతులు, ఐదు ప్రత్యేక కన్సలేషన్ బహుమతులు సాధించారు. 116 బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, ఆకాడమిక్ డీన్ శ్రీనివాసరావు, ప్రైమరీ ఇన్‌ఛార్జి అమరవేణి ,పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మంజు, భార్గవి పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వాసుపత్రి అభివద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం శుక్రవారం న్విహించారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ ఎంపిపి కట్టా శోభారాణి , కన్వీనర్ ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ చైతన్య కష్ణ, కమిటీ సభ్యులు తహశీల్దారు సిహెచ్. ఉషా, ఎంపిడిఒ జమీఉల్లా, శింగరాయకొండ సర్పంచి తాటిపర్తి వనజ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివద్ధికి సంబంధించిన పలు కీలక అంశాకు పాలనామోదం, ఆర్థికపరమైన అంశాలు, ఇతర ప్రధాన విషయాల గురించి చర్చించారు. ఆసుపత్రిలో అన్ని సదు పాయాలు అందుబాటులోకి తీసుకురావడం, మందుల కొరత నివారణకు చర్యల గురించి చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మసూద్ అలీ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి - టంగుటూరు

ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో మొత్తం 550 మంది విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారు. అందుకు గానూ 4 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 130 మంది, జూనియర్ కళాశాలలో 100 మంది, శ్రీ చైతన్య హై స్కూల్ కేంద్రంలో 120 మంది, మండల పరిధిలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 400 మంది. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 150 మంది పరీక్షకు హాజరు కానున్నారు. టంగుటూరులోని శ్రీ చైతన్య హై స్కూలు, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఎస్ఐ షేక్ ఖాదర్ భాషా, కానిస్టేబుల్ అనిల్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులను కల్పించాలని ఎస్ఐ ఖాదర్ భాషా సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య హైస్కూల్ నిర్వాహకులు వివి.రమణ. వి రాజసింహ పాల్గొన్నారు.

మత్స్యకారులకు వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. తహశీల్దారు కార్యాలయం వద్ద మత్స్యకారులకు సబ్సిడీపై టివిఎస్ ద్విచక్ర వాహనాలు, ఐస్ బాక్సులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఉషాకిరణ్, టంగుటూరు అభివద్ధి అధికారి ఎస్,విఎస్ వర్షిణి, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- జరుగుమల్లి

మండలంలోని కె.బిట్రగుంట కెజిబివిలో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రతేకాధికారి నాదెండ్ల స్రవంతి తెలిపారు. 6,7,8 తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపిసి విభాగంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6 వ తరగతి లో 40 సీట్లు, 7 వ తరగతి లో 6 సీట్లు, 8 వ తరగతి లో 2 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు (ఎంపిసి విభాగం) ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిని వారు ఈనెల 20లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పౌరహక్కులపై అవగాహన

ప్రజాశక్తి - కంభం రూరల్

రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల రెవెన్యూ అధికారి టి.రవి తెలిపారు. మండల పరిధిలోని తురిమెల్ల ఎన్ఆర్ ప్రాథమిక పాఠశాలలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పౌర హక్కుల గురించి అవగాహన కల్పించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులను తెలుసుకోవడం ద్వారా పౌరులు స్వతంత్రులుగా జీవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుభద్ర, పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు భాస్కర్ నాయుడు, పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

179 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి మండల పరిధిలోని ముప్పవరం ,చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 1,106 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 927 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 179 బేళ్లను తిరస్కరించారు. కిలోపొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.185, సరాసరి ధర రూ.194.63 పైసలు పలికినట్లు వేలం కేంద్ర నిర్వాహణాధికారి తెలిపారు.

మరుగుదొడ్లు ప్రారంభం

కొండపి : ప్రముఖ ఫర్టిలైజర్స్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కొండపిలోని మన గ్రోమోర్ సహకారంతో సామాజిక బాధ్యత నిధి నుంచి విద్యార్థులకు టాయిలెట్స్ నిర్మించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కొండపి మండలం పెదకండ్లగుంట పంచాయతీ పరిధిలోని జాళ్లపాలెం యంపియుపి స్కూల్‌లో నిర్మించిన టాయిలెట్స్‌ను జిల్లా వ్యవసాయ అదికారి ఎస్.శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఈ. నిర్మలకుమారి, ఎఒ రాము, ఎంఇఒ కె.సురేఖ, కోరమాండల్ కంపెనీ జోనల్ మేనేజర్ సురేష్, షణ్ముఖరావు, నరేష్, వసంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

యర్రగొండపాలెం : మండల పరిధిలోని అమానిగుడిపాడు జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి శుక్రవారం అందజేశారు. దుబాయ్ నివాసి కొణిజేటి శ్రీనివాసరావు , గ్రామ రెవెన్యూ అధికారి తురిమెళ్ళ శ్రీనివాస ప్రసాద్ ఆర్థిక సాయంలో విద్యార్థులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటి ,ప్రసన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

246 మందికి వైద్య పరీక్షలు

కనిగిరి : కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత గ్యాస్ట్రో వైద్యశిబిరం నిర్వహించారు. జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవిత, డాక్టర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 246 మందికి వైద్యపరీక్షలు,రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న ఎంపిపి పోరెడ్డి అరుణ

మహిళలకు అధిక ప్రాధాన్యత : ఎంపిపి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపిపి పోరెడ్డి అరుణ తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు మంజూరైన సందర్భంగా వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ సౌజన్యంతో శుక్రవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం రమేష్‌బాబు మాట్లాడుతూ మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నగదును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారి ఖాతాలో జమ చేసిన సందర్భంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయాలుగా ఎంపీపీ పో రెడ్డి అరుణ, కెనరా బ్యాంక్ సబ్ మేనేజర్లు మౌనిక, రేష్మి వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి మనోకుమారి, స్త్రీ నిధి మేనేజర్ సులోచన, అకౌంటెంట్ నాగమణి, విఒఎలు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం



వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజలందరూ ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యం జీవించాలని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి సొంత నిధులతో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డిని అభినందించారు. ఉదయానే నిద్ర లేచిన తరువాత వ్యాయామంలో భాగమైన నడకను ప్రారంభిస్తే మంచిదన్నారు. నడక అధిక రక్తపోటును నివారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకుడు కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఎఎంసి వైస్ చైర్మన్ మొగుళ్లూరి మల్లికార్జునరావు, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, మాజీ జడ్‌పిటిసి జవ్వాజి వెంకట రంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, చాటకొండ చంద్రశేఖర్, వైసిపి నాయకులు గుంటక చెన్నారెడ్డి, ఎమ్.ఉత్తమ్‌కుమార్, ఎస్‌వికెపి .డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డేవిడ్‌స్టోన్, జి.రత్నంశెట్టి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం : ఉగ్ర

ప్రజాశక్తి-వెలిగండ్ల



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

శ్యామలా వెంకటరెడ్డి పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమనిటిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే శ్యామలా వెంకటరెడ్డి పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పేదలకు, విద్యార్థులకు సేవలు అందిస్తున్న పౌండేషన్ ఛైర్మన్ శ్యామలా కాశిరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, కేసరి రమణారెడ్డి, గౌదకట్ల హరి, తమ్మినేని శ్రీను, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు గోనా వెంకటయ్య, కె.భాస్కర్‌రెడ్డి, డి.సుబ్రమణ్యం, డి.నారాయణరెడ్డి, పల్నాటి కోటిరెడ్డి, బైకాని సుబ్రమణ్యం, సోమిశెట్టి సుబ్బారావు, సోబిరాల వేణుగోపాల్, ముక్కు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొమరోలులో వాన

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని పామూరు పల్లె, గోనపల్లి, ఓట్టి వేపనపల్లె, అల్లినగరం తదితర గ్రామాల్లో శుక్రవారం వడగండ్ల వాన కురిసింది. దీంతో మామిడి తోటల్లో పూత, పిందెలు నేలరాయి. ఫలితంగా రైతులకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నాసర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దారవీడు



నాసర్‌రెడ్డి

పెద్దారవీడు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఎం. నాసర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహి స్తున్న రాజ్ కుమార్ శిక్షణ నిమిత్తం వెళ్లారు. దీంతో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నాసర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాసర్‌రెడ్డికి ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, ఎంపిటిసి పకీరయ్య మండల పరిషత్ కార్యాలయ అధికారులు, ఎంఇఒ శ్రీనివాసులు, ఎపిఎం, వైసిపి నాయకులు వెంకటె ఒడ్డి, వెంకటేశ్వరరెడ్డి అభినందనలు తెలిపారు.

సమసమాజ స్థాపనకు కృషి

ప్రజాశక్తి-పిసిపల్లి



మాట్లాడుతున్న పివి శేషయ్య

భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా పెదఇర్లపాడు, పిసిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు పివి.శేషయ్య మాట్లాడుతూ నాటి స్వాతంత్ర ఉద్యమ ద్రోహుల వారసులే నేటి మన పాలకులని విమర్శించారు. నాడు బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా దేశభక్తులైన ప్రజలు త్యాగాలకు సిద్ధపడి ఉవ్వెత్తున ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా వాజ్‌పేయిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. అయితే ఇకపై వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనని బ్రిటీష్ ప్రభుత్వానికి వాజ్‌పేయి హామీ పత్రం రాసి ఇచ్చి కేసు నుంచి విముక్తి పొందినట్లు తెలిపారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ లాంటి విప్లవ వీరులను బ్రిటిష్ ప్రభుత్వం తప్పుడు కేసులో ఇరికించి ఉరితీసినట్లు తెలిపారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించిన యూనివర్సిటీ విద్యార్థులను, జర్నలిస్టులను, పౌరుహక్కుల నాయకులపై ఉప చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అసమానతలు లేని సమ సమజాన్ని సాధించడమే స్వాతంత్ర ఉద్యమ వీరుల ఆశయమని ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగా యువత ముందుండి పోరాడాలన్నారు.



మాట్లాడుతున్న తహాశీల్దారు

2 నుంచి భూముల సర్వే

జరుగుమల్లి : శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలో ఈనెల 2 నుంచి భూ సర్వే చేపట్టనున్నట్లు తహాశీల్దారు నయీమ్ అహమ్మద్ తెలిపారు. మండల పరిధిలోని పచ్చవ, జరుగుమల్లి గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు భూ సర్వే గురించి రైతులకు వివరించారు. రెవెన్యూ. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వార్డు సచివాలయాల సహకారంతో భూ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పచ్చవ గ్రామ సర్పంచి కొండాబత్తిన కృష్ణయ్య, రీ సర్వే డిటీ రాజ్యలక్ష్మి, విఆర్ఒ లక్ష్మి, గ్రామ సర్వేయర్ ప్రసన్న లక్ష్మి, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కనిగిరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కనిగిరి అభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తెలిపారు. మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం, బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై మున్సిపల్ సిబ్బంది అజెండాను చదివి వినిపించారు. అజెండాపై చర్చించ కుండానే సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ ఇంటిపన్నులు నూరు శాతం వసూలు చేయటం ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధికి ఎక్కువ నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు. ఆదిశగా సిబ్బంది కృషిచేయాలని సూచించారు. వఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్.నారాయణరావు, మేనేజర్ ప్రసాద్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో నిందితులు అరెస్టు

వారి నుంచి రూ.4.25 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల పట్టణంలోని షణ్ముఖ జ్యూలరీ మార్ట్‌లో బంగారు, వెండి నగలను దొగిలించిన కేసులో నిందితులు అయిన పూణే సిటీ, మహారాష్ట్రకు చెందిన శేఖర్ హేమ్రాజ్ వాని, జ్యోష్న సూరజ్ కచ్వి, అనిల్ దీపక్ జాదవ్, పూజా శ్రావణ్ పరమార్, రక్షా రాజు బగడేలను శుక్రవారం అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అతి తక్కువ సమయంలో కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు. నిందితులు ఈ నెల 28వ తేదీన ఒకరికి ఒకరు తెలియని వారి లాగా షాపు లోపలికి వెళ్లి సదరు షాప్ ఓనరు అయిన పెనుగొండ శ్రీనివాస్‌ను బంగారు గొలుసులు చూపించమని అడిగారు. యజమాని దృష్టి మరల్చి చేతిలోని రుమాల్ వేసి ఏడు చైన్ల గుత్తిగా ఉన్న బంగారు నగలను దొంగిలించి అందరు అక్కడ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆలస్యంగా తన షాపులో దొంగతనం జరిగినట్లు గమనించిన షాపు యజమాని చీరాల 1 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు చీరాల ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందంగా నేరస్థలానికి వెళ్లి దొంగతనం జరిగినప్పుడు సిసి కెమెరాలో రికార్డ్ అయిన ఫుటేజ్ నుంచి ఫొటోలు సేకరించి వాటిని పాత నేరస్తుల ఫొటోలతో పోల్చి చూశారు. అందులోని మహిళ జ్యోష్న సూరజ్ కచ్విగా గుర్తించి సాంకేతిక విభాగం ద్వారా సహాయం అందుకుని నిందితులు హైదరాబాద్‌లోని ఓయో గ్రాండ్ హొటల్ దగ్గర ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ముద్దాయిల వద్ద నుంచి ఈ కేసుకు సంబంధించిన 80 గ్రాముల బరువు గల 7 బంగారు గొలుసులు, దీనితో పాటు గత 29న చీరాలలో మరొక జ్యూయలరీ షాప్‌లో దొంగతనం చేసిన సుమారు 420 గ్రాముల బరువు గల వెండి వస్తువులను స్వాధీన పరచుకున్నారు. ముద్దాయిలను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపర్చిన చీరాల 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ వి మల్లికార్జునరావు, సబ్-ఇన్‌స్పెక్టర్ వి భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ యు లక్ష్మణ్, పి కృష్ణ, హొంగార్డు కె పరమేష్‌లను జిల్లా ఎస్పి అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన షణ్ముఖ జ్యువెలర్స్ యజమాని పెనుగొండ శ్రీనివాస్ ఎస్పీని ప్రత్యేకంగా సన్మానించి పోలీస్ శాఖకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగలతో ఎస్‌పి, పోలీస్ అధికారులు

5న చలో ఢిల్లీకి తరలిరావాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

కేంద్రంలోని బిజెపి పాలనలో అన్ని వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందని, ఈ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య కోరారు. సిఐటియు సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో జి పద్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీల సేవలో మోడీ మునిగి తేలుతున్నారన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ... ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. మతం, దైవం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలన్నారు. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ.. ప్రైవేటు, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగానూ ఉందని, ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక-కర్షక ప్రదర్శనలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి నర్సింహులు, సిఐటియు నాయకులు డి శ్రీనివాసులు, పి సాయి, లక్ష్మి, జి నాగయ్య, ఎం మురళి, ఏ కుమారి, నూర్జహాన్, ఎల్ రాజమణి, ఎస్‌కే సమీరా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి-చీరాల

ఆక్రమించటంలో.. తగ్గేదేలే అన్న శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై శుక్రవారం జరిగిన చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు మున్సిపల్ రెవెన్యూ అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. కౌన్సిల్ సమావేశం అజెండాలోని అంశాలపై చర్చ అనంతరం అధికార పార్టీ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి చీరాల పట్టణ నడిబొడ్డున టౌన్ హాల్ స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమంగా నిర్మించిన మూడు దుకాణాలకు మున్సిపల్ అధికారులు పన్ను వేయడం పట్ల తీవ్రస్థాయిలో ఆక్షేపణ వ్యక్తం చేశారు. పట్టణంలోని ముఖ్యమైన కూడలిలో జరిగిన స్థల ఆక్రమణ గురించి సామాన్యులకు కూడా తెలుసని అన్నారు. ఇది ఆక్రమణ అని తెలిసినప్పటికీ మున్సిపల్ అధికారులు పన్ను ఎలా వేశారని నిలదీశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారపక్ష కౌన్సిలర్ మామిడాల రాములు, గుంటూరు ప్రభాకరరావు, పాపిశెట్టి సురేష్ తదితరులు సూరగాని లక్ష్మి వాదనను బలపరిచారు. పట్టణంలోని పొలిమేర రోడ్డు మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న రహదారి స్థలాన్ని కొందరు ఆక్రమించి అడ్డగోలుగా షాపులు నిర్మిస్తే దీన్ని అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు సదరు స్థల అంశం కోర్టులో ఉన్నప్పటికీ పన్ను వేసి హక్కులు కల్పించడాన్ని తప్పుపట్టారు. తక్షణమే సదరు షాపులకు వేసిన పన్నులు ఉపసంహరించి షాపులు తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఖాళీస్థలాలను అక్రమించడం లాంటి చర్యలను అడ్డుకోకపోతే పురపాలక సంఘానికి చెడ్డపేరు వస్తుందని కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, మామిడాల రాములు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు జోక్యం చేసుకొని ఈ విషయమై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మురుగునీటి వల్ల సుమారు 17 వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతుందని, తక్షణమే మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కీర్తి వెంకట్రావ్ కోరారు. పట్టణ మురుగు తరలించే వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అధికారులు పట్టనట్లు ఉండటం సరికాదని అన్నారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల అమలు పనులు సక్రమంగా లేవని, ఎన్నిసార్లు చెప్పినా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పట్టనట్లు ఉండటం సరికాదని కీర్తి వెంకట్రావ్ ఆక్షేపణ తెలిపారు. పురపాలక శాఖల అధికా రులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చైర్మన్ జంజనం శ్రీనివాస రావు హెచ్చరించారు. కాగా పట్టణంలోని పేద, బలహీనవర్గాల వారికి త్వరితంగా నివేశన పట్టాలు ఇవ్వాలని కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్ కోరారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం అజెండాలోని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డిఇ పి ఏసయ్య, టిపివో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ సూరగాని లక్ష్మి

ఐదు పరీక్షా కేంద్రాల్లో 680 మంది

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలో 5 పరీక్షా కేంద్రాల ద్వారా 680 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ పులి లాజర్ తెలిపారు. భట్టిప్రోలు టిఎం రావు ఉన్నత పాఠశాలలో 174 మంది, ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 87 మంది, వెల్లటూరు ఉన్నత పాఠశాలలో 104 మంది, పెదపులివర్రు ఉన్నత పాఠశాలలో 122 మంది, కె పల్లెకోన ఉన్నత పాఠశాలలో190 మంది చొప్పున పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఏప్రిల్ 3 నుంచి జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వీరిలో పెసర్లంక పాఠశాల నుంచి 43, సురేపల్లి పాఠశాల నుంచి 17 మంది, విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి 74 మంది, సిద్ధార్థ హైస్కూల్ నుంచి 25 మంది, స్వాతి పాఠశాల నుంచి 23 మంది, మాతా ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు కేటాయించిన పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-పంగులూరు

పాఠశాల స్థాయి నుంచే మహానుభావులు పుడతారు. నేటి విద్యార్థులలోనే రేపటి మహానుభావులు ఉన్నారని, అసిస్టెంట్ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ శివరామకృష్ణ అన్నారు. చదువు లేకపోతే విలువ లేదని, చదువు ద్వారానే వివిధ స్థాయిల్లో విలువ పెరుగుతుందని అన్నారు. మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు దీన దయాళ్ స్పర్శ యోజన పరీక్షలో రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన సందర్భంగా, శుక్రవారం బూదవాడ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివరామకృష్ణ మాట్లాడారు. దీన దయాళ్ స్పర్శ యోజన ఉపకార వేతన పరీక్షలో మొదటి మూడు ప్రైజులు బూదవాడ స్కూల్‌కు రావటం ఆనందదాయకమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత మాట్లాడుతూ, బహుమతులు సాధించిన పాఠశాల విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బూదవాడ గ్రామ సర్పంచ్ విస్తర్ల మార్తమ్మ, ఉప సర్పంచ్ గాది బ్రహ్మారెడ్డి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఈమని బలరామరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చార్లెస్ డార్విన్ ట్రస్ట్ సేవలు నిరూపమానం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

చార్లెస్ డార్విన్ ట్రస్ట్ సేవలు నిరూపమానం అని బాపట్ల ఆర్టీసి డిపో మేనేజర్ టీ అజిత కుమారి అన్నారు. ప్రముఖ వైద్యులు దివంగత డాక్టర్ మల్లికార్జునరావు జ్ఞాపకార్థం ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి డీఎం మాట్లాడారు. మొత్తం 15 రకాల మందులతో కూడిన ప్రథమ చికిత్సకు అవసరమయ్యే కిట్లు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కిట్లను ప్రతి బస్సులో అందుబాటులో ఉంచుతామన్నారు. అత్యవసరమైన సమయాలలో చికిత్సకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరావు కుమారుడు రాంమోహన్, గ్యారేజి ఇన్‌ఛార్జి రామకృష్ణ, సూపర్‌వైజర్ బి తిరుమల రెడ్డి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ పి నాగేశ్వరరావు, శాంతారాం, అశోక్, దర్శి నాగేశ్వరరావు, గోవర్ధన్‌రావు, జీ శ్రీనివాసరావు, అశోక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఆమంచి కృష్ణమోహన్ ఇంకొల్లు ఏఎంసీ కార్యాలయం ఆవరణలో నూతనంగా నియమత్తులైన గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు, మండల కన్వీనర్లకు శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని 1027 స్వయం సహాయక సంఘాలకు రూ.9,71,19,000 చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆమంచికి ఘన స్వాగతం పలికారు. ఇంకొల్లులో నిర్వహిస్తున్న రోడ్డు నిర్మాణంలో ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలపై బాధితులు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు చుండూరి రవి, ఇంకొల్లు మండల ఎంపిపి బండారు అనుషారాజ్ కుమార్, సర్పంచ్ ఎజర్ల ప్రసన్న సైమన్ బాబు, మచిలీపట్నం బ్యాంక్ మేనేజర్ విజయ భారతి, ఇంకొల్లు మండల వైస్ ఎంపిపి తూమాటి చలమయ్య, వైస్ సర్పంచ్ సయ్యద్ లతీఫ్, షేక్ ఉస్మాన్, పురంశెట్టి సురేష్, వాణిజ్య విభాగాధ్యక్షులు చిన్నిపూర్ణరావు, ఏపిఎం మోహన్‌రావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల్లోకి..

ప్రజాశక్తి-అద్దంకి

ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా లబ్ధి పొందుతున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణ చైతన్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలానికి సంబంధించిన మూడో విడత వైఎస్‌ఆర్ ఆసరా చెక్కును పంపిణీ కార్యక్రమానికి బాచిన కృష్ణ చైతన్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాబిషేకం చేశారు. అనంతరం మూడో విడత వైఎస్‌ఆర్ ఆసరా చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ఎంపీపీ సభ్యులు, పట్టణం అధ్యక్షులు, వైస్ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ లు, వార్డు ఇన్‌ఛార్జులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ మండల ఇన్‌ఛార్జులు, సచివాలయ కన్వీనర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు(వేమూరు)

వేమూరు మండలం పెరవలి, వేమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శుక్రవారం గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని అందజేశారు. గ్రేస్ ఫౌండేషన్ ఇప్పటికే వేమూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు. విద్య ద్వారానే సమజాభివృద్ధి సాధ్యమవుతుందని ఫౌండేషన్ అధ్యక్షులు కైతేపల్లి సాల్మన్‌రాజ్ ఆకాంక్షించారు. విద్యార్థులు అంకితభావంతో విద్యానభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యాన్నం సురేష్, యల్లమాటి దాసు, ఆయా పాఠశాలల ప్రదనోపాధ్యాయులు పాల్గొన్నారు.



కమిషనర్ రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న సూరగాని దంపతులు

కమిషనర్‌ను కలిసిన సూరగాని దంపతులు

ప్రజాశక్తి-చీరాల

చీరాల మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రామచంద్రారెడ్డిని ఐదవ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి నరసింహారావు దంపతులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

సిఐటియు ప్రధాన కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-పొదిలి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీ, సభని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం పొదిలిలో సిఐటియు ఆధ్వర్యంలో మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చిన్న బస్టాండ్ వద్ద నగర పంచాయతీ ఆఫీసు నుండి పెద్ద బస్టాండ్, పోలీస్ స్టేషన్, ఆర్.టి.సి.డిపో, విశ్వనాధపురం, ఆంజనేయస్వామి గుడి మీదుగా యం.పి.డి.ఓ. ఆఫీసు వరకు జరిగింది. ర్యాలీలో సిఐటియు పొదిలి మండలం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకట్రావు, బి.కోటేశ్వరావు, నాయకులు



పొదిలిలో బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న రమేష్

యస్.వెంకటేశ్వర్లు, వేణు, జి.నాగులు, డి.సుబ్బయ్య, పి.బాలనర్సయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి: చలో ఢిల్లీ జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు పేర్కొన్నారు. శుక్రవారం చీమకుర్తిలో పలు ప్రాంతాలలో కరపత్రాల పంపిణీ, విరాళాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పూసపాటి వెంకటరావు, బి.ఓబులేషు, కోటేశ్వరరావు, ఏడుకొండలు, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బెజవాడ శ్రీను, కె.చిన్నపురెడ్డి, ఎం.ఆంజనేయులు, కెవిపిఎస్ మండల కార్యదర్శి టి.రామారావు పాల్గొన్నారు.



చీమకుర్తిలో మాట్లాడుతున్న పమిడి వెంకటరావు

టోల్ ట్యాక్స్‌ను ఉపసంహరించుకోవాలి

ఏఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం పెంచిన టోల్ ట్యాక్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక లారీ యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్లు నిర్మించినందుకు తిరిగి రావలసిన పెట్టుబడిని లాభంతో సహా కాంట్రాక్టర్ రాబట్టుకోవడానికి టోల్ పన్నులను వసూలు చేస్తున్నారన్నారు. వాస్తవానికి రహదారుల అభివద్ధి చెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోల్ పైన రూ.5 ప్రతి లీటర్ డీజిల్ పైన రెండు రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. పన్ను ఎంత వసూలు చేసింది ఎంత ఖర్చు చేసిందనే విషయంలో పారదర్శకత లేదని, చివరికి ప్రభుత్వం టోల్ సెస్ నిర్ణయించే


మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

ముందు, పెంచే ముందు ప్రజల అభిప్రాయాల్ని పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు ఈ పోరాటానికి మద్దతు తెలిపి సంఘీభావాన్ని ప్రకటించారు. ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఒంగోలు ఒంగోలు లారీ అసోసియేషన్ అధ్యక్షులు కె.అంజిబాబు ,కార్యదర్శి ఏ రాము, కోశాధికారి కె.ప్రసాద్, అసోసియేషన్ నాయకులు కె. ప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, నాగరాజు, యాసిన్, వేమూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైసిపికి సచివాలయ కన్వీనర్లే కీలకం

- ప్రభుత్వ పథకాలను గృహసారథులతో కలిసి పంపిణీ చేయాలి

- మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి సచివాలయ కన్వీనర్లే కీలకమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చెప్పారు. శుక్రవారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లతో స్ణమావేశం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని అన్నారు. రానున్న ఎన్నికలలో సంక్షేమ పథకాలే పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని తెలిపారు. ప్రజా రంజక పాలన చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక దుష్ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు. వీటిని సోషల్‌మీడియాలో ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని కోరారు. దేశం గర్వపడే విధంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందని అన్నారు. కార్యక్రమంలో


మాట్లాడుతున్న మంత్రి సురేష్

ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయ భాస్కర్, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండల వైసీపీ కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి, యర్రగొండపాలెం, మొగుళ్ళపల్లి సర్పంచ్‌లు రామావతు అరుణాబాబు, కర్నాటి వెంటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మోటూరు

ఉదయం స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమిద్దాం

- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి - ఘన నివాళులర్పించిన నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళా ఉద్యమనేత మోటూరు ఉదయం స్ఫూర్తితో మహిళా సమస్యలపై ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పేర్కొన్నారు. మహిళా ఉద్యమనేత మోటూరి ఉదయం 21వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో జరిగింది. కార్యక్రమానికి నగర అధ్యక్షురాలు బి.గోవిందమ్మ అధ్యక్షత వహించారు. తొలుత ఉదయం చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు ఆళ్ళ సీతామహాలక్ష్మి, బి.పెద్ద గోవిందమ్మ పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఉదయం ఆంధ్ర రాష్ట్రంలో మహిళా సంఘాన్ని స్థాపించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆనాడు సమాజంలో వున్న మూఢ భావాలు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా స్త్రీ పురుష సమానత్వం కోసం అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. మహిళలకు


పామూరులో నివాళులర్పిస్తున్న నేతలు

ఆస్తి హక్కు కావాలని పోరాడారన్నారు. ఎపిలో మొదటి మహిళా మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేశారని తెలిపారు. మోటూరు ఉదయం స్ఫూర్తితో ఐద్వా ఒంగోలులో ఉదయం ట్రస్టు ఏర్పాటు చేసి.. మహిళలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం నడుపుతున్నామన్నారు. గర్భిణులకు ప్రతినెలా మూడో శుక్రవారం బెతూన్ నర్సింగ్ హెూమ్‌లో ఆమె మనుమరాలు డాక్టర్ ఉదయిని సహకారంతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ట్రస్టు తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఐద్వా నాయకురాలు భావన రాజ్యలక్ష్మీ మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, నాయకులు కె.రాజేశ్వరి, జి కళ్యాణి, సిహెచ్. రమాదేవి, యస్.ఇంద్రజ్యోతి పాల్గొన్నారు.

పామూరు: మోటూరు ఉదయం 21వ వర్ధంతి సుందరయ్య భవనంలో కామ్రేడ్ భానుమతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు షేక్ మీరా మాట్లాడారు. ముందుగా ఉదయం చిత్రపటానికి షేక్ మదర్‌బి పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఖాదరున్నీషా, రమీజా, అంజలి, ప్రజాసంఘాల నాయకుడు శంకర్, అల్లాబక్షుస ఖాసీం సాహెబ్, మహాదేవయ్య పాల్గొన్నారు.

'కోస్టల్ ఆక్వా అథారిటీ యాక్ట్‌ను సవరించాలి'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రొయ్య పిల్లల హేచరీలకు ప్రతిబంధంగా ఉన్న కోస్టల్ ఆక్వా అథారిటీ యాక్ట్-2005ను సవరించాలని రొయ్యల హేచరీస్ అసోసియేషన్, రొయ్య రైతుల సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ రొయ్యల హేచరీస్‌ను సముద్ర తీర ప్రాంతం నుంచి దూరం చేసే కోస్టల్ హేచరీస్ అక్వా అథారిటీ యాక్ట్‌ను సవరించి హేచరీల బ్రీడింగ్‌కు అవకాశం కల్పించే విధంగా మార్పు చేయాలన్నారు. రొయ్య రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్ రాయితీని కొనసాగించాలని కోరారు. సమావేశంలో రొయ్య రైతుల సంఘం ప్రకాశం జల్లా కన్వీనర్ దుగ్గినేని గోపీనాథ్, సంఘం నాయకులు ఎస్.అంజిబాబు, రొయ్యల హేచరీస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు అట్లూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ఎల్.సుజనా చౌదరి, మాజీ అధ్యక్షులు మోహన్ కుమార్, తోట వెంకట్ పాల్గొన్నారు.


కందులకు సంఘీభావం తెలుపుతున్న ఉగ్ర

ఒక్క అవకాశం ఇవ్వండి

మాజీ శాసనసభ్యులు కందుల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

'ఒక్క అవకాశాన్ని ఇవ్వండి.. మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తా..' అని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి శుర్వారం కోరారు. మండలంలో 6వ రోజు చేపట్టిన ప్రజాచైతన్యయాత్ర సందర్భంగా తువ్వపాడు నుండి ప్రారంభమై తన్నీరువారిపల్లి, కాట్రగుంట, పేరారెడ్డిపల్లి, వెంగళపల్లి, గరిమెనపెంట, పాతపాడు, గొట్లగట్టు గ్రామాల్లో పాదయాత్ర సాగింది. మాజీ మంత్రి జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కందులని కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిపి సభ్యులు కందుల రామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, చప్పిడి రామలింగయ్య, కాశిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల

నిర్మాణం వేగవంతం చేయాలి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పొదిలి

జగనన్న కాలనీలలో భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పొదిలిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా నూత నంగా నిర్మాణం జరుగుతున్న జగనన్న కాల నీలో పనులను అధికారులతో కలిసి సమీక్షిం చారు. ఒకే ఫ్లాట్ ఇద్దరు, ముగ్గురికి ఇచ్చినట్లు కొందరు లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. నిర్మాణానికి నీటి సమస్య ప్రతి కూలంగా మారుతున్న విషయం గుర్తించామ న్నారు. అందుకోసం మరో రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీ నిర్మా ణం ప్రాంతంలో దొంగతనాలు నివారించేం దుకు పోలీసులు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాఠశాలను, అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనంపై స్థానికులు కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం జువ్వలేరు సమీపంలోని కెజిబివి పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో అజయకుమార్, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈ పవన్‌కుమార్, డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో శ్రీకష్ణ, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, కమిషనర్ జోసఫ్ డానియల్ ఉన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఆధార్ కార్డుల అప్‌డేట్, కొత్త కార్డుల నమోదు కోసం నగరంలోని పలు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. సమతానగర్ సచివాలయంలో ఉన్న ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సమతా నగర్ సచివాలయంలో ఆధార్ కార్డులో తన ఫొటో అప్‌డేట్ సేవను కమిషనర్ వినియోగించుకున్నారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ మాధురీలత, డిజిటల్ అసిస్టెంట్ గౌస్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.


ఆధార్ ఫొటో అప్‌డేట్ చేయించుకుంటున్న కమిషనర్

పన్నుల వసూళ్లపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిసిన నేపథ్యంలో నగరంలో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లకు సంబంధించి రెవెన్యూ విభాగం సిబ్బందితో కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు శుక్రవారం తన ఛాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా నగరంలో గోరంట్ల సినీ కాంప్లెక్స్ యాజమాన్యం రూ.16 లక్షల పన్ను బకాయిలను కమిషనర్‌కు చెల్లించారు.

రూ.1.50 కోట్ల చెల్లింపులు..

కార్పొరేషన్ కార్యాలయానికి ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలు శుక్రవారం ఒక్కరోజే సాయంత్రానికి సుమారు రూ.1.50 కోట్లు జమయ్యాయి. రాత్రికి మరో రూ.50 లక్షల వరకు పన్నులు వసూలు కావచ్చని అధికారుల అంచనా.